# ఉన్నా అవస్థే; లేకున్నా అవస్థే!

చాలా కాలానికి మా వూరు వెళ్లాము. నన్ను చూడటానికి నా చిన్నప్పటి స్నేహితురాలు శారద వచ్చింది. కాసేపు మాటా మంతీ అయాక "నీకు పిల్లలెంత మందే శారదా" అన్నాను.

అదివరదాకా ఉత్సాహంగా మాట్లాడుతున్న దల్లా సగం కృంగిపోయి దమ్మిడీ అంత ముఖంతో, "నాకా భాగ్యం లేకపోబట్టే అయిన వాళ్ళకీ, కాని వాళ్ళకీ తేలికై పోయానే. చూడు నిజంగా నాకు మాత్రం ఓ పసిపాప బోసి నవ్వులొలకపోస్తూ తప్పటడుగులతో తిరుగాడుతూ ఉంటే మనసుకు సంతోషంగా ఉండదూ?

ఈ కారణంవల్లనే వారికి కూడా నా మీద కొంచెము నిరాదరణ కలుగుతోంది. మా మరిదిగారి పిల్లను పిల్లవాడిని 4 సంవత్సరాలు నుంచి పెంచాము. పిల్లకు అయిదారు వేలు ఖర్చుపెట్టి పెళ్ళి చేసి అత్తవారింటికి పంపాము. పిల్లాడు పట్నంలో చదువుకుంటున్నాడు. డబ్బు పంపమని కబురు మీద కబురు పంపుతూంటే కొంచెము జాగ్రత్తగా ఖర్చుచేయి నాయనా అని మందలించారని కోపము వచ్చింది. వాళ్ల నాన్న దగ్గరకు వెళ్ళి ఈ రోజు మొదలు మా గడప తొక్కనన్నాడట. కన్న బిడ్డ అయితే అలా అనగలడా చెప్పు? మళ్ళా మేమిద్దరం మిగిలాము. నేను బెంగ పెట్టుకున్నానని తెలిసి మా అక్క నన్ను చూడటానికి వచ్చి నాలుగు రోజులుండి తన ఆఖరి పిల్లవాడిని ఇక్కడ ఉంచి వెళ్లిపోయింది. అయిదు సంవత్సరముల రామును చూస్తే నేను ఎంతో మురిసి పోయాను. ఇల్లు కళకళలాడిందని ఆనందించాను. వాడికి కొత్త బట్టలు కుట్టించి, చిన్న మూడు చక్రాల సైకిలు, రంగుల గుఱ్ఱం కఱ్ఱది కొన్నారు మా వారు. ప్రైవేటు మాష్టరు గారు రోజూ వచ్చి చదువుచెప్పుతున్నారు.

ఇంటి వారమ్మాయి 3 ఏళ్ళ జానకి 2 జడలు వేసుకొన్ని చిన్న ఫ్రాకు తొడిగి మేజోళ్ళు, జోళ్లతో చిన్న చిన్న అడుగులు వేసుకుంటూ వచ్చి "లామూ! ఆలుకుందామా" అనగానే రాము గుఱ్ఱం మీదనుంచి ఒక గంతున ఉరికి వెళ్ళి పోయే వాడుఆటకి. ఒకరోజున గుఱ్ఱంమీంచిపడ్డాడు రాము. నుదుటి పైన పెద్ద గాయం తగిలి రక్తం కారింది. వాళ్ళ నాన్న గారికి యీ సంగతి తెలిసి వచ్చి రామూని తీసుకెళ్ళిపోయారు: ప్రమాదం ఏమీ లేదని చెప్పి కట్టుకడుతూన్నారు డాక్టరుగారు. త్వరలో మానిపోతుందని ఎంత చెప్పినా వినకుండా పిల్లవాడిని తీసుకువెళ్లిపోయాడు వాళ్ళనాన్న. చూడవే మళ్ళీ మామూలే నా సంగతి ఎవరితో చెప్పుకోను. ఎవరికి యెంత సొమ్ము పెట్టినా ఎవరికి యెంత చాకిరీ చేసినా మన బిడ్డలవుతారా? ఎంతసేపు కాలక్షేపం చేసుకున్నా రోజు గడవదు. ఎన్ని పుస్తకాలని చదవను...ఎన్ని అల్లికలు

కె. పద్మజ

కుట్టినా ప్రొద్దుపోదు. నిన్నుచూచి వెడదామని చాలా కాలమైందని యిలావచ్చాను." అని ఊరుకుంది.

"శారదా నీకు ఏమంత కాలం గడచిపోయిందని ఈ బెంగ. భగవంతుని దయవల్ల నీకింత కలిగి ఉంది. కులాసాగా ఖర్చుపెట్టుకోవచ్చు" అన్నాను. "నీకు తెలియదే సంఘంలో పిల్లలుగన్న తల్లికి ఉన్న విలువ. నోములకి, వ్రతాలకి శుభకార్యాలకు అన్నిటికి ముందు పిల్లలగన్న తల్లినే పిలుస్తారు. చివరకు కాసిని బియ్యం పెటవమ్మా నీ చలువైనచేత్తో అని జోలె అడిగికూడా పట్టుకెళ్ళడం మనం చూస్తూంటాము. నీ చేత్తో పిల్లవాడిని ఉయ్యాలలో ఉంచమ్మా అంటారు పిల్లలతల్లిని. ఆఖరికి శకునంకూడా చంకను బిడ్డతోవస్తే చాలా బాగుందని ప్రయాణానికి బయలుదేరుతారు. ఎవరైనా కొత్తవాళ్ళువస్తే మొదటి ప్రశ్న 'నీకెంత మంది పిల్లలు'. అనేగా, ఇంతకీ యెవరి జీవితంలో యే అదృష్టం వ్రాసివుంటే అది జరుగకమానదు. ఇంకోసారి వస్తాలే చీకటి పడుతోంది" అంటూ లేచింది శారద.

* * *

మరొకనాడు భారతియింటికి వెళ్ళాను.

"ఏమే, భారతీ అంత తీరికలేకుండా ఉన్నావా! మా ఇంటికి ఒకనాడైనా రాలేదు. పోనీ నేనే నిన్ను చూచివద్దామని వచ్చాను. మా ప్రయాణం దగ్గిరకి వచ్చింది నిన్ను చూడకుండా వెళ్ళింప అవుతుందేమో'నని అనుకున్నాను. అంతా కులాసా? ఏమిటి సంగతులు?" అన్నాను.

భారతి యెంతో సంతోషంగా నామీద నీకంత ప్రేమ ఉండబట్టి వచ్చిచూచావు. పాడుదానిని. ఒక్కసారీ మీయింటికి వచ్చి చూచాను కాదు. నా జన్మయింతేనే. ఈ యింట్లో ఒకనాటికంటె ఒకనాడు నరకమై పోతోందే. ప్రతిరోజుకూడా నేను నీ దగ్గరకు రావాలని ప్రయాణమువుతున్నాను. యేదో ఒక ఆటంకంతో సరిపోతోంది" అంది.

నీ కెంతమంది పిల్లలు అన్నాను. భారతి ముఖం ముడిపడింది చిరాకుగా. తన సంగతి నంతా ఇలా వెళ్ళబోసుకొంది:

"యేం పిల్లలు. ఏం లోకం. ఎవరితో చెప్పుకోను నా బాధలు. దాన్నిబట్టి ఆలోచించుకో నిన్ను చూచేందుకే నాకు వీలు పడలేదంటే. అనుక్షణము నువ్వు నా మనస్సులో, మెదులుతున్నావు. కాని ఏం చేయను. పెద్దపిల్లవాడికి జ్వరం. రెండోవాడు బడినుంచి వస్తూ తోటల్లో పడ్డాడు. కాలు వాచింది. వాడికి వేడినీళ్ళ కాపు వేయటం, తోమటంతో సరిపోయింది ఇక చంటిపిల్ల, ఎడపిల్ల ఎప్పుడూ పేచీకదా! ఏవేళకు ఆ పని కాకపోతే ఆయన కస్సూబుస్సూ మంటారు. నాకు పిల్లలను పెంచడమే చేతకాదనీ, వంట ఆలస్యమైతే భోంచేయకుండా ఆఫీసుకు వెళ్ళిపోతారు. అదే నాకు తగినశాస్తి. అందరూ తినకుండా నేనెలా తినగలను. కాని ఓ నౌకరును పెట్టుకుంటే ఈ సమస్య తీరిపోయేదికదా! పిల్లలను ఎత్తుకుందుకు" అన్నాను.

"సరి. సరి. 100 రూపాయలతో జీవితంలో అతి కష్టంమీద రోజులు నెట్టుకుంటుంటే నౌకరెలా వస్తారు. ఇంటి అద్దె పిల్లలచదువులు, రోగాలు, మందులు [illegible]



టేబుల్ క్లాత్ డిజైను — ఎం. జి. కాంతమ్మ.

ఖర్చులే తప్పక పోతుంటే ఇంకా తక్కినవి ఎలా జరుగుతాయిలే. యేమిటో! చూచి చూచి ఆ భగవంతుడు పిల్లల్ని మనకే యియ్యాలి. ఎంతమందో పిల్లలు లేక అలో మంటూ ఏడుస్తుంటేను" అని విసుక్కున్నది. తెల్లవారు ఝామునే లేచి పని తెముల్చుకుందామంటే నాతోపాటే చంటి పిల్ల, ఎడపిల్లకూడా లేస్తారు. ఏడుస్తే ఆయన చిరాకుపడుతూ సణుగుతూ లేస్తారు. అది మొదలు బడి పిల్లల తొందర. ఆఫీసు తొందర వంటలు, చంటిపిల్లల పేచీలు, స్నానాలు, ముస్తాబులు.

ఈలోగా నేను నీళ్ళుపోసుకోకుండా ఏ బియ్యమైనా తొందరపడి పొయ్యిమీద పెడితే పక్కవాటాలో వున్న వాళ్లెవరో యే కాఫీపొడికో, పంచదారకో వచ్చి అప్పుడే అయిపోతోందమ్మా వంట" అని వాళ్ళకు కావలసిన అప్పు పట్టికెళ్ళి, ఇరుగు పొరుగు వాళ్ళతో, "ఇంత అనాచారపు కొంప ఎక్కడా చూడలేదమ్మా, నీళ్ళుపోసుకోకుండా వంటే?" అని బుగ్గలు నొక్కుకుంటూ చెపుతారు.

ఎన్నని చెప్పేది ఏనాడో నా వీణమూల పడింది. నేనే పత్రిక అయిన ఖర్మంచాలక చదవడానికి తెచ్చుకుంటే అది పేజీ, 16 ముక్కలు కింద చింపుతుంది మా ఎడపిల్ల, ఆ పత్రిక తెచ్చినచోట సిగ్గుపడి ఇక ఎప్పుడూ అడుగలేను. లేసులు, అల్లికలు సరదా ఇదివరకే పూర్తిగా వదులుకున్నాను. ఓ సినిమా అని పేరంటము అని ఏమీ లేనే లేవు. ఉదయాస్తమానాలూ ఇలాగ సతమతమాతూంటే, మా అమ్మవస్తే ఆయనగారు చెపుతున్నారూ: పిల్లను సముదాయించ లేనుట, ఇంటిపనులు చేయలేనుట. అష్టమానం నాకు విసుగు తప్ప మరొకటి లేదుట. బయటి ప్రపంచంలో ఏమి జరుగుచున్నది నాకు అక్కరలేదట. చూడనుట విననుట. తల కూడా తీరుబడి అయిన రోజు నేనెప్పుడో దువ్వుకుంటానుట.

ఎవరి మెప్పుకి నేను యీ యాతనంతా పడుతున్నానో, నాకు తెలియటంలేదు. నా యీడువాళ్లకి కొందరికి పెళ్లయినా కాలేదు. ఎంతో ఉత్సాహంగా చీకుచింత లేకుండా చదువుకుంటున్నారు. నాకు అప్పుడే నా బ్రతుకుమీద రోత పుడుతున్నది. పగవాళ్లకైనా ఒద్దే యీ యాతనా పిల్లలూను. పిల్లలు లేనివాళ్లు నిజంగా ఎంత అదృష్టవంతులు! కాలక్షేపానికి అనేక విధానాలున్నాయి" అంది భారతి.

* * *

నాకు ఇంటికి వెళ్తున్నప్పుడు ఆలోచన ఒకటే. "ఏది మంచి? ఏది చెడు? శారద అలా బాధపడింది. భారతి ఇలా బాధపడింది. నాకు ఏది నిజమో నిర్ణయించేందుకు శక్తి లేకపోయింది. కాని ఇద్దరూ చెరోవిధంగానూ జీవితంమీద విరక్తి పడుతూనే వున్నారు. బలవంతాన్ని కాలాన్ని నెట్టుతున్నారు. మానవునకు ముఖ్యంగా ఉండవలసిన తృప్తికి ఇద్దరూ దూరమైపోయారు. ★